సోమవారం 24-6-2024

# ముందడుగు

దినపత్రిక

సంపుటి: 1, సంచిక: 374, పేజీలు: 4 | ₹6

EPAPER.MUNDADUGU.COM

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD | KARIMNAGAR | WARANGAL | JAGITYAL | KHAMMAM | NALGONDA | MAHABOOBNAGAR | NIZAMABAD

మీ ప్రాంతంలో జరిగే ఏలాంటి సమస్య ఐనా ముందడుగు దృష్టికి తీసుకురండి.. సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేద్దాం. మీ ప్రాంతంలో మీరు ముందడుగు పౌర పాత్రికేయుడిగా పనిచేయొచ్చు.. మీ సమస్యలపై స్పందించండి..

Mundadugu whatsapp:
9491114616
email: mundadugu111@gmail.com




రగులుతున్న నిరుద్యోగులు

వివరాలు 4లో



ఐయోవాలో నీట మునిగిన వందల ఇళ్లు

వివరాలు 3లో



జాగ్రత్త.. రాష్ట్రంలో డెంగ్యూ పెరుగుతోంది

వివరాలు 4లో



బాల్యమే దేశ భవిష్యత్తు..!

వివరాలు 5లో

## సిబిఐ చేతికి నీట్ వ్యవహారం

- అక్రమాలపై పూర్తి స్థాయిలో విచారణ
- ఆదివారం కేసు నమోదు చేసిన సిబిఐ




ముందడుగు ఢిల్లీ:

నీట్ ప్రశ్నపత్రం లీకేజీ అంశంలో కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. వైద్య విద్యా కోర్సుల్లో ప్రవేశాలకు మే 5న నిర్వహించిన ఈ పరీక్షలో అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు వెల్లువెత్తడంతో దీనిపై దర్యాప్తు చేయాలని కేంద్రం నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తాజాగా కేంద్ర విద్యాశాఖ ఆదేశాల మేరకు సీబీఐ ఆదివారం కేసు నమోదు చేసింది. నీట్ పరీక్షలో అక్రమాలు జరిగినట్లు వస్తోన్న ఆరోపణలపై పూర్తి స్థాయిలో విచారించనుంది. అలాగే, బిహార్‌లో పేపర్ లీక్, పలుచోట్ల విద్యార్థులు సమయం కోల్పోయారంటూ వారికి గ్రేస్ మార్కులు కలపడం వంటి అంశాలపైనా సమగ్రంగా విచారించనుంది.

కేంద్ర విద్యాశాఖ సూచనల మేరకు నమోదు చేసిన ఈ కేసులో నిందితులుగా గుర్తు తెలియని వ్యక్తులను చేర్చినట్లు సీబీఐ తెలిపింది. దేశవ్యాప్తంగా దాదాపు 24లక్షల మంది విద్యార్థులు రాసిన ఈ పరీక్షలో అక్రమాలు, మోసాలు జరిగాయని పలుచోట్ల కేసులు నమోదైనట్లు కేంద్ర విద్యా మంత్రిత్వశాఖ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. దీనిపై ఉన్నత స్థాయి సమీక్ష అనంతరం పరీక్షల ప్రక్రియలో పారదర్శకత కోసం ఈ వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు చేసేందుకు సీబీఐకి అప్పగించాలని నిర్ణయం తీసుకున్నట్లు సదరు అధికారి వెల్లడించారు.

## నీట్ పరీక్షల్లో మున్నాభాయ్ ఎంబీబీఎస్‌లు

- కొన్నేళ్లుగా కొనసాగుతున్న నీట్ అక్రమాలు
- పేరు మోసిన గ్యాంగ్ హస్తం ఉన్నట్లు సమాచారం



ముందడుగు జాతీయం:

నీట్ పరీక్షల్లో ఒకరికి బదులు మరో వ్యక్తి మెడికల్ ఎంట్రెన్స్ పరీక్ష రాసి ర్యాంక్ సాధిస్తాడు. కొన్నేళ్లుగా ఇలాంటి అక్రమాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. తాజాగా పేపర్ లీక్‌లో 'సాల్వర్ గ్యాంగ్' హస్తం ఉన్నట్లు బయటపడటంతో బిహార్ పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. జాతీయ స్థాయిలో ఈ గ్యాంగ్ కీలక సభ్యుడు రవి అత్రి మిగతా 2లో

## నీరు విడుదల చేసేంతవరకు నిరవధిక దీక్ష

- బ్యారేజీ గేట్లను మూసివేసిన హరియాణా
- ఢిల్లీ జలవనరుల శాఖ మంత్రి ఆతిశీ

ముందడుగు ఢిల్లీ:

హరియాణా ప్రభుత్వం దేశ రాజధాని ఢిల్లీకి తాగు నీటిని విడుదల చేసే బ్యారేజీ గేట్లను మూసివేసిందని ఢిల్లీ జలవనరుల శాఖ మంత్రి ఆతిశీ అన్నారు. హత్నీకుండ్ బ్యారేజీ నిండా నీరున్నా విడుదల చేయట్లేదని ఆరోపించారు. వాటా ప్రకారం దక్కాల్సిన నీటిని విడుదల చేసేంతవరకూ నిరవధిక దీక్షను కొనసాగిస్తామని స్పష్టం చేశారు. దేశ రాజధానికి హరియాణా నుంచి పూర్తిస్థాయిలో నీటిని విడుదల చేయాలన్న డిమాండ్‌పై ఒత్తిడి తెచ్చేందుకు మిగతా 2లో



## మాఫియా చేతుల్లో దేశ విద్యావ్యవస్థ

- యువత భవిష్యత్తుకు అడ్డంకిగా బీజేపీ
- బీజేపీ పాలనలో పేపర్ లీకులు
- కాంగ్రెస్ అగ్రనాయకురాలు ప్రియాంక గాంధీ

ముందడుగు జాతీయం:

కేంద్ర ప్రభుత్వం మొత్తం విద్యా వ్యవస్థను మాఫియా, అవినీతిపరులకు అప్పగించిందని కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ మండిపడ్డారు. నీట్, యూజీసీ నెట్ పరీక్షలు ఇప్పటికే రద్దయ్యాయని.. నీట్ ప్రశ్నాపత్రం లీక్ అయిందని ప్రియాంక గాంధీ అన్నారు. దేశ విద్యావ్యవస్థ, పిల్లల భవిష్యత్తు అత్యాశాపరులకు అప్పగించారని మిగతా 2లో



ముందడుగు
సోమవారం, 24-6-2024, హైదరాబాద్

# నీట్ పరీక్షల్లో మున్నాభాయ్ ఎంబీబీఎస్‌లు

మొదటిపేజీ తరువాయి

హస్తం ఉన్నట్లు బలంగా విశ్వసిస్తున్నారు. అతడి కనుసన్నల్లోనే నీట్ పేపర్ లీకైనట్లు భావిస్తున్నారు.

### ఆశ్చర్యపరిచే ఈ గ్యాంగ్ నెట్‌వర్క్...

నీట్ పేపర్ లీక్ వెనక ఈ గ్యాంగ్ హస్తం ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఈ ముఠా ప్రశ్నపత్రాన్ని ముందుగానే చేజిక్కించుకోవడం.. దానికి సమాధానాలు తయారు చేసి.. వాటిని సోషల్ మీడియా ద్వారా కొనుగోలుదార్లకు పంపడంలో అందెవేసిన చెయ్యి. గతంలో కూడా వేర్వేరు రాష్ట్రాల్లోని పలు పరీక్ష పత్రాలను లీక్ చేసిన కేసుల్లో రవి అత్రి పాత్ర ఉన్నట్లు ఆరోపణలు వచ్చాయి. అతడికి ఆయా ప్రాంతాల్లోని ఎగ్జామ్ మాఫియాతో బలమైన సంబంధాలున్నాయి. ప్రశ్న పత్రాలను పరీక్షకు ఒక రోజు ముందు సంపాదించడంలో ఇతడు నిష్ణాతుడు. ఈ సాల్వర్ గ్యాంగ్‌కు డబ్బులు చెల్లిస్తే అసలు అభ్యర్థుల స్థానంలో నకిలీలను ప్రవేశపెట్టి పరీక్షలు రాయిస్తుంది. కచ్చితంగా ర్యాంక్ వస్తుందన్న హామీ ఇచ్చి.. భారీగా సొమ్ములు తీసుకొని ఈ పనిచేస్తుంది.

### డాక్టర్ కావాల్సినవాడు.. లీకర్‌గా మారాడు..!

2007లో రవి అత్రిని తల్లిదండ్రులు మెడికల్ ఎంట్రెన్స్ ఎగ్జామ్ కోసం సిద్ధమయ్యేందుకు రాజస్థాన్‌లోని కోటాకు పంపించారు. అతడు అక్కడ కొన్నేళ్లపాటు చదువుకొని 2012లో పీజీఐ రోహ్‌తక్‌లో సీటు సంపాదించాడు. నాలుగో ఏడాది డ్రాపౌట్ అయ్యాడు. అప్పటికే అతడు ఎగ్జామ్ మాఫియాతో సంబంధాలు పెట్టుకున్నాడు. ఇతరుల మెడికల్ ఎంట్రెన్స్ ఎగ్జామ్స్‌కు అతడు హాజరై పేపర్ రాసేవాడు. దీంతోపాటు లీకైన పేపర్లను పంపిణీ చేయడంలో కీలక పాత్ర పోషించడం మొదలుపెట్టాడు. ఇతడిని ఉత్తరప్రదేశ్ స్పెషల్ టాస్క్ ఫోర్స్ అధికారులు అరెస్టు చేశారు.

### సంజీవ్ ముఖియా కుటుంబం హస్తం..

ఈసారి నీట్ పేపర్ లీకేజీలో కేంద్ర బిందువుగా నిలిచిన వ్యక్తి సంజీవ్ ముఖియా. ఇతడు కూడా సాల్వర్ గ్యాంగ్‌లో సభ్యుడే. ఇతడి కుమారుడు కూడా దీనిలో కీలక పాత్ర పోషించాడు. గతంలో బీపీఎస్‌సీ టీచర్స్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ పరీక్ష, కానిస్టేబుల్ పరీక్షల లీకుల్లో కూడా వీరి హస్తం ఉంది. ప్రస్తుతం నీట్ వివాదం పెద్దదికావడంతో సంజీవ్ ముఖియా నేపాల్ పారిపోయినట్లు అనుమానిస్తున్నారు.

### ఝార్ఖండ్‌లోని హజారీబాగ్ కేంద్రంగా..?

బిహార్ పొరుగు రాష్ట్రమైన ఝార్ఖండ్‌లోని హజారీబాగ్ ప్రాంతం లీకులకు కేంద్రంగా మారుతోంది. ఇక్కడ ఒయాసిస్ స్కూల్ నీట్ పేపర్ లీకేజీలో కీలకంగా వ్యవహరించినట్లు బిహార్ పోలీస్‌లోని ది ఎకనామిక్ అఫెన్స్ వింగ్ గుర్తించింది. ఇక్కడ ట్యాంపర్ చేసిన నీట్ ప్రశ్నపత్రాలను స్వాధీనం చేసుకున్నారు. మార్చిలో బీపీఎస్‌సీకి చెందిన టీచర్ రిక్రూట్‌మెంట్ పరీక్ష పత్రాన్ని కూడా ఇక్కడి నుంచే లీక్ చేశారు. అప్పుడు కూడా ఇక్కడ 268 మంది అభ్యర్థులకు ముందు రోజు రాత్రి ప్రశ్నపత్రం అందినట్లు అధికారులు గుర్తించారు.

## దళారుల వైద్యంతో దేశానికి ప్రమాదం



ఒక మనిషి అనారోగ్యానికి గురైనప్పుడు అతడికి ఏం జరిగిందో, ఏలాంటి చికిత్స అందించాలో అర్హత గల వైద్యులు చేసే పని. కాని నేడు అర్హత లేకుండా వైద్యం చేస్తున్న (RMP, PMP) నకిలీ వైద్యులు చేసే వైద్యం వల్ల, ప్రజల ఆరోగ్యం దెబ్బ తినడమే కాక, వీళ్లు చేస్తున్న దళారీ పనుల వల్ల, ప్రజల మీద 30-50% అధిక ఆర్థిక భారం పడుతుంది. విచక్షణ లేకుండా ఇచ్చే యాంటీబయాటిక్స్ వల్ల సూక్ష్మ క్రిములు బలంగా అయ్యి, మందులు పని చేయని రోగాలు ప్రబలే ప్రమాదం ఉంది. దీనితో ప్రపంచానికే తీరని నష్టం జరుగుతుంది. గ్రామీణ వైద్యులుగా చెప్పకునే వీరు, పట్టణ ప్రాంతాలలో అత్యధికంగా ఉన్నారు అనేది నమ్మలేని నిజం. అయినా, ప్రతి జిల్లాకు ఒక వైద్య కళాశాల, ప్రతి గ్రామానికి ఒక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ప్రతి వెయ్యి జనాభాకు ఒక ఆశ వర్కర్ ఉండగా, మళ్లీ, వీళ్ల అవసరం ఏంటి..!!?? ప్రజారోగ్యంతో చెలగాటం ఆడుతూ తమని తాము RMP, PMP లుగా చెప్పకుంటున్న అర్హత లేని నకిలీ వైద్యులు లేని సమాజం కోసం ప్రభుత్వం ఎలాంటి చర్యలు ఎందుకు చేయడం లేదు.!?

- డాక్టర్. ప్రతిభాలక్ష్మి, గాంధీ ఆసుపత్రి. హైదరాబాద్

## మావోయిస్టు మోస్ట్ వాంటెడ్ బిచ్చు లొంగుబాటు

**86 ఎన్‌కౌంటర్లు, 15 కాల్పుల ఘటనలో క్రియాశీలకం**




ముందడుగు చత్తీస్ ఘడ్ :

మావోయిస్టు మోస్ట్ వాంటెడ్ గడ్చిరౌలి జిల్లా మావోయిస్టు ఉద్యమ ఇన్‌చార్జ్ గిరిధర్ తుమ్రెట్టి అలియాస్ బిచ్చు ఈరోజు డిప్యూటీ సీఎం, పోలీస్ అధికారుల సమక్షం లో లొంగిపోయాడు. బిచ్చు భార్య సంగీత అలియాస్ లలిత కూడా లొంగి పోయింది. మహారాష్ట్ర డిప్యూటీ సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ సమక్షం లో లొంగిపోయారు. బిచ్చు లొంగుబాటుతో గడ్చిరౌలి జిల్లాతో పాటు మధ్య భారత్‌లోని మావోయిస్టు ఉద్యమానికి కోలుకోలేని ఎదురుదెబ్బ తగిలినట్టయిందని పోలీసులు భావిస్తున్నారు.

కాగా గిరిధర్ తుమ్రెట్టి 86 ఎన్‌కౌంటర్లు, 15 కాల్పుల ఘటనలో క్రియాశీలక పాత్ర పోషించాడు. బిచ్చుపై 25 లక్షల రూపాయల రివార్డు ఉంది. అనేక ప్రభుత్వ వ్యతిరేక ఘటనలో పాల్గొన్నందుకు 179 కేసులు ఉన్నాయి. 1996 నుంచి 2024 వరకు అనేక ఘటనల్లో వివిధ హోదాల్లో ప్రధాన సూత్రధారిగా వ్యవహరించాడు...



## డీఎస్పీని కానిస్టేబుల్‌గా డిమోట్ చేశారు

**మహిళా కానిస్టేబుల్‌తో అక్రమ సంబంధమే కారణం**

ముందడుగు ఉత్తరప్రదేశ్:

మహిళా కానిస్టేబుల్‌తో అక్రమ సంబంధం పెట్టుకున్న డీఎస్పీకి ఉత్తరప్రదేశ్ పోలీసులు తగిన బుద్ధి చెప్పారు. అతడిని కానిస్టేబుల్ స్థాయికి డిమోట్ చేస్తూ ఆదేశాలు జారీచేశారు. మహిళా కానిస్టేబుల్‌తో రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడిన మూడేండ్ల తర్వాత ఇదంతా జరగడం గమనార్హం. కృపా శంకర్ కనౌజియా కానిస్టేబుల్ స్థాయి నుంచి అంచెలంచెలుగా ఎదుగుతూ డీఎస్పీ స్థాయికి ఎదిగాడు. కాగా, 2021లో ఉన్నావ్‌లోని బిఘాపూర్‌లో సర్కిర్ ఆఫీసర్‌గా విధులు నిర్వర్తించేవారు. ఆ సమయంలో కుటుంబ కారణాలు చెప్పి లీవ్ పెట్టారు. ఇంటికి వెళ్లాడానికి బదులు ఓ మహిళా కానిస్టేబుల్‌తో కలిసి కాన్పూర్‌లోని హోటల్‌కు వెళ్లాడు. ఈ క్రమంలో వ్యక్తిగత, అధికారిక ఫోన్లను స్విచ్ఛాఫ్ చేశాడు. దీంతో భర్త ఇంటికి రాకపోవగా, ఫోన్లు కలువకపోవడంతో ఏం జరిగిందోనని భయపడిపోయిన అతని భార్య జిల్లా ఎస్పీని ఆశ్రయించారు. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి గాలింపు చేపట్టారు. అయితే ఫోన్ లొకేషన్ ఆధారంగా కాన్పూర్‌లోని ఓ హోటల్‌లో ఉన్నట్లు గుర్తించారు. దీంతో అక్కడికి చేరుకున్న పోలీసులు ఒక్కసారిగా అవాక్కయ్యారు. మహిళా కానిస్టేబుల్‌తో ఏకాంతంగా గడుపుతుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అయితే ఉన్నతాధికారి మహిళా కానిస్టేబుల్‌లో ఉండటాన్ని సీరియస్‌గా తీసుకున్న అధికారులు.. విచారణకు ఆదేశించారు. సీసీటీవీ ఫుటేజీతోపాటు ఇతర ఆధారాలు సేకరించిన అధికారులు.. అతడిపై క్రమశిక్షణారాహిత్యం కింద కఠిన చర్యలు తీసుకోవాలని సిఫారసు చేశారు. ఇందులో భాగంగా డీఎస్పీగా ఉన్న అతడిని గోరఖ్‌పూర్‌లోని 26వ ప్రావిన్షియల్ ఆర్మ్‌డ్ కానిస్టేబులరీ బెటాలియన్‌లో కానిస్టేబుల్‌గా డిమోట్ చేశారు.

## మాఫియా చేతుల్లో దేశ విద్యావ్యవస్థ

మొదటిపేజీ తరువాయి

మండిపడ్డారు. రాజకీయ నేతల దురహంకారం వల్లే పేపర్ లీక్‌లు, పరీక్ష రద్దులు జరుగుతున్నాయని అన్నారు. మోడీ పాలనలో క్యాంపస్ ల నుంచి విద్య మాయం అవుతుందని ధ్వజమెత్తారు. రాజకీయ గుండాయిజం విద్యా వ్యవస్థకు గుర్తింపుగా మారిందని తెలిపారు. బీజేపీ ప్రభుత్వం ఒక్క పరీక్షను కూడా సక్రమంగా నిర్వహించలేదని మండిపడ్డారు. యువత భవిష్యత్తుకు బీజేపీ అడ్డంకిగా మారిందన్నారు. దేశంలోని సమర్థులైన యువత వారి విలువైన సమయాన్ని, బీజేపీపై పోరాడేందుకు వృథా చేస్తున్నాయని అన్నారు. అయినప్పటికీ మోడీ స్పందించకుండా ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారని మండిపడ్డారు.

## నీరు విడుదల చేసేంతవరకు నిరవధిక దీక్ష

మొదటిపేజీ తరువాయి

అతిశీ చేపట్టిన దీక్ష మూడో రోజుకు చేరింది. "ఢిల్లీకి అందాల్సిన నీటి కంటే 100 MGD తక్కువగా హరియాణా ప్రభుత్వం విడుదల చేస్తోంది. దీంతో దాదాపు 28 లక్షల మంది ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు" అని ఆమె 'ఎక్స్' వేదికగా ఓ వీడియోను పంచుకున్నారు. ఢిల్లీకి రావాల్సిన తాగు నీటిని విడుదల చేయాలని కోరుతూ అతిశీ శుక్రవారం నిరవధిక నిరాహార దీక్ష చేప్టటారు. దక్షిణ దిల్లీలోని భోగల్‌లో చేపట్టిన ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ సతీమణి సునీతా కేజ్రీవాల్, ఆమ్ ఆద్మీ పార్టీ ఎంపీ సంజయ్ సింగ్, ఢిల్లీ మంత్రి సౌరభ్ భరద్వాజ్ తదితరులు పాల్గొన్నారు. తాగునీటి సరఫరా కోసం ఉత్తరప్రదేశ్, హరియాణాలపై ఢిల్లీ ఆధారపడుతోంది. వాటా ప్రకారం.. హరియాణా నుంచి ఢిల్లీకి 613 MGD (రోజుకు మిలియన్ గ్యాలన్లు) రావాల్సి ఉంది. కానీ, హరియాణా 513 MGDలను మాత్రమే విడుదల చేస్తోందని ఆప్ ఆరోపిస్తోంది.

ముందడుగు
సోమవారం, 24-6-2024, హైదరాబాద్

# చెకప్ పేరుతో తప్పించుకున్న గర్భిణీ ఖైదీ

## జైలు గార్డుల కళ్లగప్పి పరారైన మహిళ

ముందడుగు మధ్యప్రదేశ్: ఒక మహిళ గర్భిణీ ఖైదీ పోలీసుల కళ్లగప్పి తప్పించుకుంది. ఆసుపత్రిలో చెకప్ సందర్భంగా తప్పించుకుని పారిపోయింది. దీంతో ఆ మహిళా ఖైదీ కోసం పోలీసులు వెతుకుతున్నారు. మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో ఈ సంఘటన జరిగింది. విదిషా జిల్లాలోని కుర్వాయి ప్రాంతానికి చెందిన 24 ఏళ్ల సలేహా ఖురేషీ తన ప్రియుడిని హత్య చేసింది. దీంతో పోలీసులు ఆమెను అరెస్ట్ చేశారు. అయితే విదిషా జిల్లా జైలులో ఉన్న సలేహా గర్భవతిగా నిర్ధారణ అయ్యింది. ఈ నేపథ్యంలో ఏప్రిల్ 27న ఆమెను విదిషా జిల్లా జైలు నుంచి భోపాల్ సెంట్రల్ జైలుకు



తరలించారు. విచారణ ఖైదీగా ఉన్న గర్భవతి అయిన సలేహాను వైద్య పరీక్షల కోసం శనివారం హమీదియా ఆసుపత్రికి తీసుకెళ్లారు. అయితే జైలు గార్డుల కళ్లగప్పిన ఆమె అక్కడి నుంచి తప్పించుకుంది. ఈ విషయం తెలుసుకున్న జైలు అధికారులు షాక్ అయ్యారు. కోహెఫిజా పోలీసులు, సెంట్రల్ జైలు అధికారులకు సమాచారం ఇచ్చారు. ఈ నేపథ్యంలో తప్పించుకుని పారిపోయిన గర్భిణీ ఖైదీ సలేహా కోసం పోలీసులు వెతుకుతున్నారు.




# బడికి డుమ్మా కొట్టి వివాహేతర సంబంధం

## ఉపాధ్యాయుడిని చెట్టుకు కట్టేసిన గ్రామస్థులు

ముందడుగు భద్రాద్రి కొత్తగూడెం: విద్యార్థులకు మంచి, చెడులు చెప్పాల్సిన ఉపాధ్యాయుడు తప్పదోవ పట్టాడు. బడికి డుమ్మా కొట్టి మరీ వివాహేతర సంబంధం కొనసాగిస్తున్న ఉపాధ్యాయుడిని గ్రామస్తులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం అతడిని చెట్టుకు కట్టేసి చితకబాదారు. ఈ ఘటన భద్రాద్రి జిల్లాలో చోటు చేసుకుంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట మండలం నెమలిపేటలో ఉన్న ఐటీడీఏ పాఠశాలలో రాందాస్ అనే వ్యక్తి ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. రోజూ స్కూల్‌కు వచ్చి పాఠాలు చెప్పాల్సిన అతడి బుద్ధి పక్కదారి పట్టింది. స్థానికంగా ఉన్న ఓ మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. పాఠశాలకు రాకుండా మహిళతో ఉంటున్నాడు. ఈ విషయాన్ని గమనించిన గ్రామస్తులు, సదరు మహిళ భర్త.. రాందాస్‌ను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం అతడిని చెట్టుకు కట్టేసి చితకబాదారు. విషయం తెలుసుకున్న ఎంఈవో కృష్ణయ్య, సీఐ జితేంద్ర అక్కడికి చేరుకుని రాందాస్‌ను విడిపించి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

# ఐయోవాలో నీట మునిగిన వందల ఇళ్లు



ముందడుగు జాతీయం: భారీ వర్షా లతో అగ్రరాజ్యం అమెరికాలోని ఐయోవా రాష్ట్రం జలమయంగా మారింది. దీంతో భారీ సంఖ్యలో ప్రజలు ఇళ్లను వదిలి సురక్షిత ప్రదేశాలకు తరలి వెళ్తున్నారు. దాదాపు 4,200 మంది జీవించే రాక్‌వ్యాలీ ప్రాంతంలోని వందలాది ఇళ్లు పూర్తిగా నీట మునిగిపోయాయి. సమీపంలోని రాక్ నది పొంగిపొర్లుతోంది. ఇక్కడ చిక్కుకుపోయిన వారిని హెలికాప్టర్లు, బోట్లతో తరలిస్తున్నారు. భారీ వర్షా లపై మేయర్ కెవిన్ మాట్లాడుతూ.. నిన్న రాత్రి గంటన్నరలో నాలుగు అంగుళాల వర్షపాతం నమోదైనట్లు పేర్కొన్నారు. ఇక్కడ

- వరద ధాటికి కనిపించని వీధులు
- హెలికాప్టర్లు, బోట్లతో ప్రజలను తరలింపు
- సౌత్ డకోటా రాష్ట్రంలో ఎమర్జెన్సీ ప్రకటన

ఉన్న 21 కౌంటీల్లో విపత్తుగా గవర్నర్ కిమ్ రేనాల్డ్స్ ప్రకటించారు. సియూక్స్ కౌంటీలో ఎక్కడా వీధులు కనిపించడంలేదు. సౌత్ డకోటా రాష్ట్రంలో కూడా ఎమర్జెన్సీ ప్రకటించారు. ఈ విషయాన్ని గవర్నర్ క్రిస్టిన్ నొయిమ్ పేర్కొన్నారు. రాష్ట్ర ఆగ్నేయ ప్రాంతంలో భారీగా వర్షా లు కురుస్తుండటంతో ఈ నిర్ణయం తీసుకొన్నారు. ఇక్కడ దాదాపు 18 అంగుళాల వర్షపాతం నమోదైంది. చాలా వరకు జాతీయ రహదారులు జలమయమయ్యాయి. సియోక్స్ ఫాల్‌లో 7 అంగుళాల వర్షపాతం కురిసింది. ప్రస్తుతం వానలు కొంచెం తగ్గుముఖం పట్టినా.. అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని నొయిమ్ అభిప్రాయపడ్డారు. సోమ, మంగళవారాల్లో ఇక్కడి నదులకు భారీగా వరద రావచ్చని హెచ్చరించారు.

# శ్రీశైల మల్లికార్జునుడిని దర్శించుకున్న తెలంగాణ హైకోర్టు జస్టిస్ ప్రియదర్శిని



ముందడుగు

తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎంజీ ప్రియదర్శిని ఆదివారం ఆంధ్రప్రదేశ్ లోని నంద్యాల జిల్లాలో గల శ్రీశైలం దేవస్థానాన్ని సందర్శించారు. శ్రీభ్రమరాంబికాదేవి, మల్లికార్జున స్వామి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా జస్టిస్ ప్రియదర్శిని దంపతులకు శ్రీశైలం ఈఓ పెద్ది రాజు సహా దేవస్థానం అర్చకులు ఆలయ మర్యాదల ప్రకారం సాదర స్వాగతం పలికారు. తదుపరి ఈఓ పెద్ది రాజు జస్టిస్ ప్రియదర్శినీ దంపతులకు ప్రసాదం, శ్రీభ్రమరాంబికా మల్లికార్జున స్వామి అమ్మవార్ల చిత్ర పటాలను అందజేశారు. జస్టిస్ దంపతులకు వేద పండితులు వేదాశీర్వచనం చేశారు.

ముందడుగు
ఆదివారం, 23-6-2024, హైదరాబాద్



## స్కై ఫౌండేషన్ 255వ అన్నదాన కార్యక్రమం

### హజరైనా సినిమా నటులు గౌతమ్ రాజు

ముందడుగు హైదరాబాద్:

హైదరాబాద్ నగరంలో రోజు రోజుకు నిరాశ్రయులు ఎక్కువ అవుతున్నారు, ఉండడానికి ఆశ్రయం కరువై ఆకలితో అలమటిస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరందరిని ఆదుకొని కొత్త జీవితాన్ని అందివ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాము. నగరంలో వాహనంలో సంచరిస్తూ ఆకలితో ఉన్న అనాథలు, నిరాశ్రయులకు నిర్వహించిన 255వ అన్నదాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీనియర్ సినీనటులు గౌతమ్ రాజు విచ్చేసి కార్యక్రమాన్ని నిర్వహించారు, గౌతమ్ రాజు మాట్లాడుతూ స్కై ఫౌండేషన్ నిబద్ధతతో, ఓపికగా నిస్వార్ధంగా నిరంతరం సమాజ సేవ కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు, క్రమం తప్పకుండా ప్రతి ఆదివారం సేవ కార్యక్రమాలను కొనసాగించడం చాలా అరుదైన విషయమని ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్ కి అభినందనలు తెలియజేసారు. ఈ అన్నదాన కార్యక్రమంలో ప్రెసిడెంట్ డాక్టర్. వై. సంజీవ కుమార్, వైస్ ప్రెసిడెంట్ పావని. ఓ, సభ్యులు నేహా, చిన్నారి రోష్ని, అఖిల్, ఇఫ్రాన్, జతిన్, శుభం తదితరులు పాల్గొన్నారు.

# జాగ్రత్త.. రాష్ట్రంలో డెంగ్యూ పెరుగుతోంది

## టైర్లు, డబ్బాలు, కొబ్బరిబొండాలతో జాగ్రత్త ▪ రాష్ట్రాన్ని హెచ్చరించిన డబ్ల్యూహెచ్‌వో

ముందడుగు తెలంగాణ:

తెలంగాణ రాష్ట్రంలో డెంగ్యూ కేసులు పెరుగుతోన్నాయి. చెత్త కుప్పల్లో, మురికి కాలువల్లో వృద్ధి చెందే ఈ దోమలు ఇంట్లో కూడా పెరుగుతోన్నాయి. వర్షకాలం వర్షపు నీరు నిలిచిపోయి డెంగ్యూ దోమలు పెరుగుతోన్నాయి. ముఖ్యంగా ఇళ్లలో వీటి వృద్ధి ఎక్కువగా ఉన్నట్లు గుర్తించారు. అందుకే ఎండాకాలం కూలర్ వాడిన తర్వాత అందులో వాటర్ తీసివేయాలి. లేకుంటే అందులో దోమలు వృద్ధి చెందుతాయి. అలాగే కొబ్బరి బొండాలను ఇంటి బయట పడేస్తారు. అందులో నీరు చేరి దోమలు తయారవుతాయి.

### ఇంటిపై టైర్లు, డబ్బాలతో ప్రమాదమే

ఇంటిపై టైర్లు, డబ్బాలు పడేస్తుంటారు. వాటిలో కూడా నీరు చేరి దోమలు వృద్ధి చెందేందుకు అవకాశం ఉంటుంది. చాలా నిర్లక్ష్యంగా ఉండడంతో డెంగ్యూ దోమలు వృద్ధి చెంది డెంగ్యూ జ్వరాలు



వస్తున్నాయని అధికారులు చెబుతున్నారు. ముందు జాగ్రత్త చర్యలు తీసుకోకపోవడం వల్ల కూడా కేసులు పెరుగుతున్నాయని ఆరోగ్య శాఖ అంచనా వేస్తోంది. ఆస్పత్రులు డెంగ్యూ కేసులపై రిపోర్ట్ ను ఆలస్యం చేస్తుండడం వల్ల కేసుల సంఖ్యపై ఒక్కోసారి గందరగోళం ఏర్పడుతుందని డబ్ల్యూహెచ్‌వో విశ్లేషించింది.

### ఆదిలోనే చికిత్స అవసరం

డెంగ్యూకు సరైన, కచ్చితమైన ట్రీట్‌మెంట్ అంటూ లేదని డబ్ల్యూహెచ్‌వో వివరించింది. ఆదిలోనే గుర్తించడం వల్ల తీవ్రతను తగ్గించేందుకు వీలవుతుందని పేర్కొంది. డెంగ్యూ సోకిన వారికి మొదట తీవ్రమైన జ్వరం, తలనొప్పి, కళ్లలో నొప్పి, కండరాలు, కీళ్ల నొప్పులు, వాంతులు, గ్రంథుల వాపు, దద్దుర్లు వస్తాయి. సివియర్ డెంగ్యూ కేసుల్లో తీవ్రమైన కడుపు నొప్పి, అదేపనిగా వాంతులు, వేగంగా శ్వాస తీసుకోవడం, ముక్కు, చిగుళ్ల నుంచి రక్తం కారడం వంటి సింటమ్స్ ఉంటాయని డబ్ల్యూహెచ్‌వో వివరించింది. అలాగే అలసట, వాంతులు, విరేచనాల్లో రక్తం, బాగా దాహం వేయడం, చర్మం పాలిపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయని పేర్కొంది.

### తెలంగాణలో డెంగ్యూ ప్రభావం

డెంగ్యూ వచ్చినట్లు త్వరగా తెలుసుకుంటే చికిత్స నయం చేయవచ్చని పేర్కొంది. రాష్ట్రంలోలో డెంగ్యూ తీవ్రత అత్యధికంగా ఉన్నట్లు డబ్ల్యూహెచ్‌వో తెలిపింది. డెంగ్యూ ఎక్కువగా ఉన్న రాష్ట్రాల జాబితాలో తెలంగాణ ఉన్నట్లు ప్రకటించింది. డెంగ్యూలోని నాలుగు ప్రధాన వేరియంట్లన్నీ తెలంగాణలో కనిపిస్తున్నాయని వివరించింది. డీఈఎన్‌వీ1, డీఈఎన్‌వీ2, డీఈఎన్‌వీ3, డీఈఎన్‌వీ4 ప్రభావం ఎక్కువగా ఉంటున్నట్లు ప్రకటించింది.

# రగులుతున్న నిరుద్యోగులు

ముందడుగు హైదరాబాద్:

ఉద్యోగాల కోసం నిరుద్యోగులు రగిలిపోతున్నారు. ఇచ్చిన హామీలు మరిచిన కాంగ్రెస్ ప్రభుత్వంపై నిప్పులు చెరుగుతున్నారు. అధికారంలోకి వస్తే గ్రూప్స్ పోస్టులు పెంచుతామని ఎన్నికల్లో ఇచ్చిన హామీని తుంగలో తొక్కిన సీఎం రేవంత్ వైఖరిపై మండిపడుతున్నారు. గద్దెనెక్కిన తర్వాత కాంగ్రెస్ అసలురంగు బయటపడిందని, నిరుద్యోగులను నమ్మించి నయవంచన చేసిందని దుమ్మెత్తి పోస్తున్నారు. తమకు నమ్మకద్రోహం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నిరసనలు కొనసాగిస్తున్నారు. ముఖ్యంగా పది ప్రధాన డిమాండ్ల సాధన కోసం ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీ వేదికగా నేడు ఉదయం నుంచి ఆమరణ నిరాహార దీక్ష నిర్వహిస్తున్నట్లు నిరుద్యోగ జేఏసీ పిలుపునిచ్చింది. దీక్షలో గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్-3తో పాటు డీఎస్సీ, గురుకుల టీచర్ పోస్టుల అభ్యర్థులు, 46 జీవో బాధితులు పెద్దసంఖ్యలో పాల్గొనేందుకు సిద్ధమయ్యారు. నిరుద్యోగుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్నట్టు జేఏసీ నాయకుడు మోతీలాల్ నాయక్ ప్రకటించారు. దీక్షకు అన్ని విద్యార్థి, నిరుద్యోగ సంఘాలు పూర్తి మద్దతు ప్రకటించాయి. బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య సైతం తన సంపూర్ణ మద్దతు ప్రకటించారు.

### 'ఉద్యోగాలు ఇస్తారా..? గద్దె దించాలా?'

'ఉద్యోగాలు ఇస్తారా..? గద్దె దించాలా?' అనే నినాదంతో ఉద్యమాలు చేస్తామని తెలంగాణ నిరుద్యోగ యువత ప్రకటించింది. ఇచ్చిన హామీల అమలుకోసం ఇప్పటికే ఇందిరాపార్కు వద్ద వేలాది మంది నిరుద్యోగులు మహాధర్నా నిర్వహించారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) కార్యాలయం వద్ద పెద్దఎత్తున ధర్నా చేశారు. అంతకుముందు సచివాలయం ముట్టడికి సిద్ధపడిన నిరుద్యోగులను పోలీసులు ముందస్తుగా గృహనిర్బంధం చేసి అడ్డుకున్నారు. ఇందుకు కొనసాగింపుగా నల్లగొండ, కరీంనగర్, భద్రాద్రి కొత్తగూడెంతో పాటు పలు జిల్లాలో నిరుద్యోగుల నిరసన కార్యక్రమాలు జోరందుకున్నాయి.

### అడిగితే అరెస్టులా..?

కాంగ్రెస్ మాయమాటలు నమ్మి ఆ పార్టీని అధికారంలోకి తెచ్చేందుకు ఓటర్ల కాళ్లావేళ్లా పడి ఓట్లేయించినందుకు తమకు కాంగ్రెస్ ప్రభుత్వం తగిన గుణపాఠం చెప్పిందని నిరుద్యోగులు బాధపడుతున్నారు. నెలరోజులు పుస్తకాలు పక్కనబెట్టి ఆ పార్టీ గెలుపు కోసం పాటుపడ్డామని, తమను కాంగ్రెస్ నమ్మించి మోసం చేసిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు లక్షల




ఉద్యోగాలు ఇవ్వడంతో పాటు నిరుద్యోగులందరికీ న్యాయం చేస్తామన్న కాంగ్రెస్, ఇప్పుడు హామీలు అమలు చేయాలని అడిగితే పోలీసులతో అరెస్టులు చేస్తున్నదని మండిపడుతున్నారు. హామీలు నెరవేర్చేదాకా తగ్గేదే లేదని, ప్రత్యేక తెలంగాణ కోసం ఎలా పోరాడామో ఇప్పుడు తమ డిమాండ్ల సాధన కోసం అలానే ఉద్యమిస్తామని హెచ్చరిస్తున్నారు.

### నిరుద్యోగుల 10 ప్రధాన డిమాండ్లు ఇవే

- గ్రూప్-2లో 2,000 వరకు పోస్టులు పెంచాలి
- గ్రూప్-3లో 3,000 వరకు పోస్టులు పెంచాలి
- గ్రూప్-1 మెయిన్స్‌కు 1:100 నిష్పత్తిలో అభ్యర్థులను పిలవాలి
- డీఎస్సీలో ఉన్న 11 వేల పోస్టులను 25వేలకు పెంచాలి
- జీవో 46ను వెంటనే రద్దు చేయాలి
- గురుకుల పోస్టుల్లో రిలింక్విష్‌మెంట్ అమలు చేయాలి
- ఏడాదిలోనే 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేయాలి
- జాబ్ క్యాలెండర్‌ను తక్షణమే ప్రకటించాలి
- రూ.4,000 నిరుద్యోగ భృతి ఇవ్వాలి
- డిసెంబర్‌లో గ్రూప్స్ పరీక్షలు నిర్వహించాలి.

ముందడుగు
సోమవారం, 24-6-2024, హైదరాబాద్







# బాల్యమే దేశ భవిష్యత్తు..!



శోభారాణి, బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు

- సమాజంపై అవగాహన పెంచాలి..
- మహిళల్లో ప్రశ్నించేతత్వం పెరగాలి
- శోభారాణితో ముందడుగు ముచ్చట్లు

**అభివృద్ధి అంటే ఏంటి.. డబ్బు ఉంటేనే అభివృద్ధి కాదు కదా.. ఒక మనిషి అన్ని రంగాల్లో, అన్ని విధాలుగా అవగాహన పెంచుకొని ముందుకు సాగాలి.. ఎంతోమంది సమాజానికి దూరంగా బతుకుతున్నారు.. సమాజంలో ఉన్న సగం మందికి వారి సమస్యలు ఏలా పరిష్కరించుకోవాలో అవగాహన ఉండదు.. అందుకే పేదల కోసం, బడుగు, బలహీన వర్గాల కోసం, గిరిజనుల కోసం పనిచేయాలని, వారిలో వారికి సంబంధించిన ఆంశాలపై అవగాహన పెంచాలని పసిపిల్లల మోములపై చిరునవ్వులు చిందేలా, మహిళల అభ్యున్నతి కోసం తమ వంతు ప్రయత్నంతో ముందుకు నడుస్తోంది బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు శోభారాణి. ఆవిడ చేస్తున్న కార్యక్రమాలపై ముందడుగుతో పంచుకుంది..**

### బాలలు అంటే ఒక భరోసా

బాలలు అంటే కార్మికులు కాదు, వారు దేశ భవిష్యత్తు అని చెపుతున్నారు. బాలల హక్కుల కమిషన్ సభ్యురాలిగా అనునిత్యం బాలల హక్కుల కోసం పరితపిస్తూ ఉన్నారు. రేపటి సమాజ నిర్మాణం రాబోయే బాలలదేనని వారి చదువు పరంగానే కాకుండా బలమైన తిండి లభించినప్పుడు ఒక విద్యార్థి అన్ని రకాలుగా పరిపూర్ణత సాధిస్తాడని అంటోంది శోభారాణి. తాను కమిషన్ సభ్యురాలిగా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి ఇప్పటివరకు అదిలాబాద్, ములుగు, జనగామ, కరీంనగర్ జిల్లాలలోని అధికారులు సైతం పర్యటించేందుకు ఆలోచించి ఎన్నో తండాలను, గిరిజన గ్రామాలను సందర్శించి వారి జీవన స్థితిగతులపై, ప్రభుత్వం అందించే పథకాలు కింది స్థాయికి చేరేలా కృషి చేస్తున్నారు.



ముందడుగు హైదరాబాద్:

మంచి మార్పు రావాలి.. పది మందికి మంచి చేయాలనే ఆలోచన అందరిలో ఉంటుంది.. కాని దానిని ఆచరణలో పెట్టేవారు చాలా తక్కువ మంది ఉంటారు. కాని బాలల హక్కుల కోసం, మహిళల సమస్యల కోసం, వికలాంగుల అభివృద్ధి కోసం తన వంతుగా ప్రయత్నం చేయాలనే తపన శోభారాణిలో ఉంది. అందుకే ఎవరి కోసమో, ఎవరి మీదనో ఆధారపడకుండా తానే ఎందుకు ఒక సంస్థను ఏర్పాటు చేసి, తాను పడ్డ కష్టాలు మరొకరు ఎందుకు పడాలి అనే ఆలోచనతోనే స్పందన సోసైటీ ఏర్పాటు చేసింది. తన సంస్థ నుంచి చిన్నారులకు, వికలాంగులకు, ఎంతోమంది మహిళలకు భరోసా నిస్తూ ఎందరో జీవితాల్లో వెలుగులు నింపేందుకు అహర్నిశలు కృషి చేస్తూనే ఉంది. మహిళ ఆర్థికంగా ఎదుగుతేనే ఆ కుటుంబం బాగుంటుందని ఇప్పటివరకు వేలాది మంది మహిళలకు వివిధ అంశాలపై శిక్షణ ఇవ్వడంతో వారు ఆర్థికంగా నిలదొక్కుకొని కుటుంబానికి అండగా ఉంటున్నారు. సమాజంపట్ల ఆమె పడుతున్న తపనను, ఆమెలో సేవా గుణాన్ని చూసి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యురాలిగా నియమించింది.

### బాల్యాన్ని ప్రోత్సాహిద్దాం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిత్యం ఎన్నో పథకాలు ప్రవేశపెడుతున్నాయి. కాని కొన్ని గిరిజన గ్రామాల్లోని అక్కడి పరిస్థితులు చూస్తుంటే బాధ కలుగుతోంది. అవకాశం లేక కొన్ని ప్రాంతాల్లో, అవకాశం ఉండి మరికొన్ని ప్రాంతాల్లో ఎదుగుతున్న బాల్యానికి సరియైన విద్యం, వైద్యంతో పాటు పౌష్టికాహారం అందడం లేదు. వికలాంగులైన పిల్లల పరిస్థితి మరీ అధ్వాన్నంగానే ఉంటుంది. వారికి సరియైన గుర్తింపు, ప్రోత్సాహం కరువైపోతున్నాయి. బాల్యానికి చేయూత నివ్వాల్సిన బాధ్యత అందరిపై ఉంది అంటున్నారు.

### పదవి కాదు, సేవే శాశ్వతం

మనిషికి అధికారం, పదవి శాశ్వతం కాదు. నాలుగు రోజులు ఉంటుంది, పోతుంది కాని మనం సమస్యపై తల్లడిల్లుతున్న వారిపట్ల ఏలా స్పందించామన్నదే ప్రధానం. ఆపదలో తల్లడిల్లుతూ, కష్టాలలో ఉన్నవారి ఒక్కరి కన్నీరును తుడిచినా ఈ జన్మకు సార్థకత ఉంటుంది. పదవిలో ఉన్నప్పుడు ఒక తీరుగా, పదవిలో లేనప్పుడు మరో తీరుగా కాకుండా తానెప్పుడు మహిళల సాధికారత కోసం, బాలల హక్కుల కోసం, వికలాంగుల అభివృద్ధి కోసం నిరంతరం పనిచేస్తూనే ఉంటాను. వారిలో చైతన్యాన్ని రగిలిస్తూ తమవంతుగా మంచి మార్పుకోసం ప్రయత్నిస్తూనే ఉంటాను అని గర్వంగా చెపుతోంది అనుమాండ్ల శోభారాణి.

## రేపు పవన్‌కల్యాణ్‌తో సినీ నిర్మాతల భేటీ

అమరావతి :

ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ తో సినీ నిర్మాతలు సోమవారం భేటీ కానున్నారు. విజయవాడలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మధ్యాహ్నం ఈ భేటీ జరుగనుంది. సినీ నిర్మాతలు అశ్వినీదత్, చినబాబు, నవీన్, రవిశంకర్, నాగవంశీ, విశ్వప్రసాద్, బోగవల్లి ప్రసాద్, డివివి.దానయ్య, ఫిల్మ్ ఛాంబర్ అధ్యక్షుడు దిల్‌రాజు, దామోదరప్రసాద్ తదితరులు కలువనున్నారు. చిత్రపరిశ్రమ ఎదుర్కొంటున్న పలు సమస్యలను పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకురానున్నారు. సినిమా టికెట్ల ధరల పెంపు వెసులుబాటు, థియేటర్ల సమస్యల వాటిపై చర్చించే అవకాశముంది. చిత్ర పరిశ్రమకు చెందిన పవన్‌కల్యాణ్ నటుడిగా ఎదిగి రాజకీయ రంగ ప్రవేశం చేసి , డిప్యూటీ సీఎం స్థాయికి ఎదిగినందుకు గాను అభినందనలు తెలియజేయడానికి కూడా నిర్మాతలు మొదటిసారి పవన్‌ను కలువనున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ను నేరుగా నటుడు చిరంజీవి ఆధ్వర్యంలో నాగార్జున, మహేశ్‌బాబు, ప్రభాస్, నిర్మాతలు దిల్‌రాజ్ కలిసి సమస్యలను విన్నవించారు. అప్పటి మంత్రుల వ్యవహారశైలీతో ప్రముఖ నటులు తమ చిత్రాల విడుదల సమయంలో అనేక ఇబ్బందులను ఎదుర్కొన్నారు. అనుకూలమైన వ్యక్తులకు ఆంక్షల సడలింపు, వ్యతిరేకంగా కనిపించిన వారికి ఆంక్షలు విధించి విమర్శల పాలయ్యారు.